వర్క్ ఇన్‌స్పెక్టర్లే కాంట్రాక్టర్లు

- ఏఈలను శాసిస్తున్న వర్క్ ఇన్‌స్పెక్టర్లు, లీకు వర్కర్లు
- ట్యాప్ కనెక్షన్ ఇవ్వాలంటే రూ.12 నుంచి 15 వేలు డిమాండ్
- అనధికారికంగా ట్యాప్ కనెక్షన్ ఇవ్వాలంటే రూ.20 నుంచి 50 వేలు
- వీరికి అంతర్గత బదిలీలకు అవకాశం లేదు


హౌసింగ్‌బోర్డులో నిర్మాణంలో ఉన్న ఇంటికి మున్సిపల్ ట్యాప్ కనెక్షన్ ఇచ్చిన దృశ్యం

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థలో అంతా వర్క్ ఇన్‌స్పెక్టర్లు, లీకు వర్కర్ కమ్ ఫిట్టర్ హవా కొనసాగుతోంది. ఆయా డివిజన్లలో ఏ పని చేయాలన్నా వర్క్ ఇన్‌స్పెక్టర్లు, లీకు వర్కర్లే దగ్గరుండి చూసుకోవడం.. అవసరమైతే తామే కాంట్రాక్ట్ అవతారమెత్తి పనులు చక్కబెడుతుంటారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఏళ్ల తరబడి ఒకే ప్రాంతంలో విధులు నిర్వహించడంతో వారికి అవినీతికి అడ్డూఅదుపు లేకుండా పోయింది.

ఏఈలను కూడా శాసిస్తున్న వైనం

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ఇటీవల ఏఈల అంతర్గత బదిలీలు జరిగాయి. అయితే సదరు ప్రాంతంలో ఏఈలకు అన్ని తామే అయి వ్యవహరిస్తుంటారని ఆరోపణలు ఉన్నాయి. కొన్ని సందర్భాల్లో ఏఈలను కూడా శాసించే స్థాయికి వర్క్ ఇన్‌స్పెక్టర్లు, లీకు వర్కర్లు వెళ్లారు. ఆయా డివిజన్లలో వర్క్ ఇన్‌స్పెక్టర్లే కాంట్రాక్టర్లుగా వ్యవహరించడంతో... వేరే వారిని టెండర్ కూడా వేయనియకుండా చూడటంలో సిద్ధహస్తులే. అవసరమైతే తామే కాంట్రాక్టర్లుకు పెట్టుబడి పెట్టి పనులు చేయిస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు.

ఓ లీకు వర్కర్‌కు సుమారు రూ.16లక్షల బిల్లులు పెండింగ్

గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఓ రిజర్వాయర్‌లో పనిచేసే ఓ లీకు వర్కర్ తానే కాంట్రాక్ట్ అవతారమెత్తి పైపులైన్ పనులు, సిల్ట్ వర్క్ పనులు చేశాడు. అయితే దీనికి సంబంధించి సుమారు రూ.16 లక్షలు పెండింగ్ ఉందంటే సదరు లీకు వర్కర్ ఆదాయం ఎంత ఉందో అర్థం చేసుకోవచ్చు. ఎల్‌బీనగర్, బీఆర్ స్టేడియంలో, ఎల్ఎల్ఆర్, సర్కిల్ ఆఫీస్, ఏటీ అగ్రహారం తదితర ప్రాంతాల్లో వర్క్ ఇన్‌స్పెక్టర్లే కాంట్రాక్టర్లుగా అవతారమెత్తి నామినేషన్ పద్ధతిలో కొంచెం పనికి కూడా పెద్ద పని చూపి అధికంగా బిల్లులు పెట్టుకుని డ్రా చేసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. ఏటీ అగ్రహారం, రెడ్డిపాలెం, ఇతర పలు ప్రాంతాల్లో అనధికారికంగా వాటర్ ట్యాపులు ఇచ్చి రూ.30 నుంచి 50 వేలు దాకా వసూలు చేస్తున్నట్లు సమాచారం. పశ్చిమ నియోజకవర్గంలో ఫిట్టర్ నుంచి ఫిల్టర్ బెడ్ ఆపరేటర్‌గా పదోన్నతి పొందిన ఓ ఉద్యోగి తిరిగి ఫిట్టర్‌కే డిమోషన్ తీసుకుని మరి ఫిట్టర్ విధులు నిర్వహిస్తున్నాడంటే విషయం అర్థం చేసుకోవచ్చు.

బదిలీలు లేకపోవడంతో...

వర్క్‌ఇన్‌స్పెక్టర్లు, లీకు వర్కర్లకు అంతర్గత బదిలీలు లేకపోవడంతో ఆడిందే పాట..పాడిందే పాటగా మారింది. ఒక ఇంటికి ట్యాప్ కనెక్షన్ ఇవ్వాలంటే దానికి సరిపడ అన్ని చలానాలు నగరపాలక సంస్థకు చెల్లించినా ట్యాప్ కనెక్షన్ ఇవ్వాలంటే రూ.12 నుంచి 15 వేలు దాకా తీసుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. నిర్మాణంలో ఉన్న ఇంటికి ట్యాప్ కనెక్షన్ ఇవ్వకూడదు... కాని వీరు అడ్డగోలుగా నిర్మాణంలో ఉన్న ఇంటికి కూడా ట్యాప్ కనెక్షన్‌లు ఇచ్చేస్తున్నారు. ఇప్పటికైన నగరపాలక సంస్థ కమిషనర్ స్పందించి వర్క్ ఇన్‌స్పెక్టర్లు, లీకు వర్కర్లు దందాను అరికట్టి.. అంతర్గత బదిలీలు నిర్వహించాలని పలువురు కోరుతున్నారు.

లీకులకు మరమ్మతులు చేపట్టాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశం



మంగళవారం సాక్షిలో ప్రచురితమైన కథనం


లీకైన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

నెహ్రూనగర్: తాగునీటి సరఫరా విషయంలో ఉదాసీనత సరికాదని, యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కమిషనర్ సంజీవయ్య నగర్ రైల్వే గేటు దగ్గర పంపింగ్ లైన్‌పై ఏర్పడిన లీకులను పరిశీలించారు. మంగళవారం 'సాక్షి'లో తాగునీరు వృథా శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ హెడ్ వాటర్ వర్క్స్ నుంచి వస్తున్న పంపింగ్ లైన్‌పై ఏర్పడిన లీకును యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని, పనుల్లో జాప్యం వలన నగరంలో తాగునీటి సరఫరాలో లోపం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తాగునీటి సరఫరా విషయంలో ఇంజినీరింగ్ అధికారులు ఉదాశీనంగా వ్యవహరించ కూడదని, పెండింగ్ సమస్యలు ఉంటే తక్షణం తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. లీకు పనులు మూడు రోజుల్లో పూర్తి చేసేలా కాంట్రాక్టర్‌తో సమన్వయం చేసుకోవాలని ఈఈని ఆదేశించారు. అదే పైప్‌లైన్ ఇంటర్ కనెక్షన్ కోసం పెండింగ్ పనులను సమీక్షించి పైప్ లైన్ ఇంటర్ కనెక్షన్‌పై చర్చి ప్రతినిధులు, చుట్టు పక్కల నివాసాల వారితో కమిషనర్ నేరుగా చర్చించి, ఎవరికి సమస్య లేకుండ పైప్‌లైన్ పనులు చేపడతామని, పైప్ లైన్ ఇంటర్ కనెక్షన్ వలన లక్షల మంది నగర ప్రజల తాగునీటి సమస్య పరిష్కారం అవుతుందని, ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. పర్యటనలో ఎస్ఈ నాగమల్లేశ్వర రావు, ఈఈ కోటేశ్వరరావు, డీఈఈ కళ్యాణ రావు, ఏఈ నాగవేణి పాల్గొన్నారు.

డిసెంబర్ ఒకటి నుంచి ఇంటింటి చెత్త సేకరణ

నెహ్రూనగర్: నగరంలో డిసెంబర్ ఒకటి నుంచి నూరు శాతం ఇంటింటి చెత్త సేకరణ జరిగేలా ప్రజారోగ్య విభాగ కార్యచరణ ఉండాలని నగర పాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. స్థానిక కౌన్సిల్ హాల్‌లో ప్రజారోగ్య విభాగ శానిటరీ సూపర్వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు, ప్రత్యేక పర్యవేక్షణ అధికారులతో నగరంలో పారిశుద్ధ్య పనుల నిర్వహణపై సమీక్ష మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర ప్రజల ఆరోగ్య రక్షణలో పారిశుద్ధ్య విభాగం కీలకమన్నారు. అటువంటి ప్రజారోగ్య విభాగంలో ప్రతిఒక్కరూ అంకిత భావంతో పని చేయాలని చెప్పారు. నగరంలో ఆవులు రోడ్ల మీద ట్రాఫిక్‌కి అంతరాయం కల్గిస్తూ ఉన్నాయని, వాటిని అవసరమైతే పోలీసుల సహకారం తీసుకొని, వెంగళాయపాలెంలోని జీఎంసీ ఆవుల షెడ్‌కి తరలించాలని ఆదేశించారు. సమావేశంలో డెప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, సిహెచ్. శ్రీనివాస్, సీఎంఓహెచ్ఓ డాక్టర్ శోభారాణి, ఎంహెచ్ఓ రవిబాబు, ఈఈ సుందరరామిరెడ్డి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేపు మధుమేహంపై అవగాహన సదస్సు

గుంటూరు మెడికల్: మధుమేహం నిరోధమే లక్ష్యంగా ఎస్‌హెచ్ఓ హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం శాస్త్రీయ అవగాహన సభ నిర్వహించనున్నట్లు ఎస్‌హెచ్ఓ అధ్యక్షుడు డాక్టర్ టి.సేవకుమార్ తెలిపారు. ప్రపంచ 'మధుమేహం నిరోధక దినం' సందర్భంగా ఉదయం 9 గంటలకు 'మధుమేహం- కారణాలు- లక్షణాలు- నిర్ధారణ పరీక్షలు- చికిత్స విధానాలు, రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు 'అనే అంశంపై స్థానిక బ్రాడీపేట 2వ లైనులోని ఎస్‌హెచ్ఓ భవనంలో అవగాహన సభ జరుగుతోందన్నారు.

అంబేడ్కర్ చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలి



నెహ్రూనగర్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చరిత్రను పాఠ్య అంశాల్లో చేర్చాలని కోరుతూ సీఎం చంద్రబాబుకు లక్ష పోస్టు కార్డులు పంపుతున్నట్లు భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షులు పాగళ్ల ప్రకాష్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం లాడ్జిసెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద పోస్టు కార్డుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ జీవిత చరిత్రను 6వ తరగతి నుంచి ఎంఏ వరకు పాఠ్యాంశంగా పెట్టాలన్నారు. అంబేడ్కర్ అధ్యయన కేంద్రాలు(లైబ్రరీలు) ప్రతి మండలంలో ఏర్పాటు చేయాలని కోరారు. అంబేడ్కర్ స్మృతి వనాన్ని ప్రపంచ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు డెనిస్ రాయ్, సాధు మాల్యాద్రి, కైలా జయసుధ, గంట ప్రభుదాస్ పాల్గొన్నారు.

హోప్ విన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



గుంటూరు మెడికల్: పేదల ఆరోగ్యానికి భరోసా కల్పించాలన్న లక్ష్యంతోనే ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు హోప్ విన్ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ షమ సుల్తానా పేర్కొన్నారు. ప్రతి నెల క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలలో భాగంగా తాడికొండ మండలం పొన్నెకల్లులో ఉన్న లూథరన్ చర్చిలో మంగళవారం హోప్ విన్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. హాస్పటల్ చైర్మన్, సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ షమ సుల్తానా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న సుమారు 200 మంది రోగులను పరీక్షించి అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. ఈసందర్భంగా డాక్టర్ షమ సుల్తానా మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య భద్రతకు తమ హాస్పిటల్స్ నిరంతరం ఉచిత వైద్య శిబిరాలు కొనసాగిస్తుందన్నారు. ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పేదలకు ఏదో ఒక రూపంలో సహాయం చేయాలన్న ఉద్దేశంతో గుంటూరు కొత్తపేట ఓల్డ్ క్లబ్ రోడ్డు, గుంటూరువారితోట 7వ లైన్‌లోని తమ హాస్పిటల్‌లో కేవలం రూ.10లకే ఓపీ సౌకర్యం అందుబాటులోకి తెచ్చామన్నారు.

జీఎస్టీలో ట్యాక్స్ కన్సల్టెంట్ల పాత్రే కీలకం

జీఎస్టీ జాయింట్ కమిషనర్ లక్ష్మీనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న సెంట్రల్ జీఎస్టీ జాయింట్ కమిషనర్ లక్ష్మీనారాయణ

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): జీఎస్టీలో ట్యాక్స్ కన్సల్టెంట్ల పాత్రే కీలకమని సెంట్రల్ జీఎస్టీ జాయింట్ కమిషనర్ బి.లక్ష్మీనారాయణ చెప్పారు. స్థానిక కన్నావారితోటలో మంగళవారం 'ఈజీ టాక్స్' పేరుతో కొత్తగా ప్రారంభించిన టాక్స్ కన్సల్టెన్సీ సర్వీస్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. జీఎస్టీ రిటైర్డ్ అసిస్టెంట్ కమిషనర్, ఈజీ టాక్స్ నిర్వాహకుడు చుక్కా విల్సన్ బాబు అధ్యక్షత వహించారు. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. జీఎస్టీ చెల్లింపుదారులు తెలిసీతెలియక ఎన్నో తప్పులు చేస్తున్నారని, వాటిని సరిదిద్దటానికి ట్యాక్స్ కన్సల్టెంట్లు ఎంతో అవసరమన్నారు. పన్ను చట్టాల నిబంధనలు తరచూ మార్పులకు లోబడి ఉటాయని పేర్కొన్నారు. అర్థం చేసుకుని అప్‌డేట్ చేయడం కన్సల్టెంట్లకే సాధ్యమన్నారు. జీఎస్టీ డెప్యూటీ కమిషనర్ వి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ఉద్యోగ విరమణ చేసిన నిష్ణాతులైన అధికారులు ఇలాంటి సంస్థ నెలకొల్పడం అభినందనీయమన్నారు. జీఎస్టీ నిఘా విభాగం అసిస్టెంట్ కమిషనర్లు ఎం.నాగరాజు, రవికుమార్ మాట్లాడుతూ.. టాక్స్ కన్సల్టెంట్లతో సమాజంలో అవగాహన పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఇంకా విశ్రాంత జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్లు రాజేశ్వరరావు, వివేకానంద, క్రెడాయ్ ఏపీ చైర్మన్ ఆళ్ళ శివారెడ్డి, ఈజీ టాక్స్ వ్యవస్థాపకుడు చుక్కా విల్సన్ బాబు తదితరులు మాట్లాడారు.

నగరంలో స్థానిక సమస్యలపై దృష్టి సారించాలి

సచివాలయ కార్యదర్శులకు కమిషనర్ శ్రీనివాసులు ఆదేశం


సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేస్తున్న కమిషనర్

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో వార్డు సచివాలయ కార్యదర్శులు స్థానికంగా ఉండే ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. మంగళవారం రత్నగిరి నగర్, తురకపాలెం రోడ్, నగరాలులోని సరస్వతీ నగర్ తదితర ప్రాంతాల్లో స్థానికుల ఫిర్యాదు మేరకు నగరపాలక సంస్థ అధికారులతో కలసి మంగళవారం పరిశీలించారు. తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ నూతన రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని, ప్రజల నుంచి అందే ఫిర్యాదులు లేదా అర్జీలను నేరుగా క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తామని చెప్పారు. వార్డు సచివాలయాల వారీగా స్థానిక సమస్యల పరిష్కారానికి ఆయా కార్యదర్శులు బాధ్యత తీసుకోవాలన్నారు. పారిశుద్ధ్యం, నీటి సరఫరా, పైప్‌లైన్ మైనర్ లీకులు, ఇంటి పన్నులు, రహదారుల ఆక్రమణలు, వీధి దీపాలు వంటి సమస్యలను సచివాలయం పరిధిలోనే పరిష్కారానికి కృషి చేయాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే కార్యదర్శులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రత్నగిరినగర్‌లో పర్యటించి, తాగునీరు సక్రమంగా రావడంలేదన్న స్థానికుల ఫిర్యాదు మేరకు పెద్ద పలకలూరు రోడ్‌లో అదనంగా బోర్‌లు ఏర్పాటు చేసి, నీటిని అందించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను, ఖాళీ స్థలాలో పెరిగిన మొక్కలను తొలగించుకోవాలని స్థల యజమానులకు నోటీసులు ఇవ్వాలని శానిటేషన్ కార్యదర్శులను ఆదేశించారు. ప్యాచ్ వర్క్‌లు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. తురకపాలెం రోడ్‌లో పర్యటించి, స్థానిక వార్డు సచివాలయంలో నూతన ట్యాప్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని స్థానికులకు తెలిపి, సదరు రోడ్ పక్కన వేసిన వ్యర్థాలను తొలగించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ని ఆదేశించారు. నగరాల్లోని సరస్వతీ నగర్‌లో యూజీడీ ఓవర్ ఫ్లో ఫిర్యాదుని పరిశీలించి, యూజీడీకి అనధికారికంగా కనెక్షన్ చేసిన వారిని గుర్తించి తక్షణం కనెక్షన్ తొలగించాలన్నారు. తాగునీటి సరఫరా సమయంపై స్థానికుల ఫిర్యాదు మేరకు ప్రతి మూడు నెలలకు ఒక సారి సరఫరా సమయం మార్చాలన్నారు. ఆయా ప్రాంతంలో మురుగునీరు పారుదలకు వీలుగా కచ్చా డ్రెయిన్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఏఈని ఆదేశించారు. పర్యటనలో ఈఈ కోటేశ్వరరావు, డీఈఈలు రమేష్ బాబు, శ్రీనివాస్, డీసీపీ సూరజ్ కుమార్, ఏఎంహెచ్ఓ ఆనంద కుమార్ పాల్గొన్నారు.

నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దడంలో

గుంటూరు నగరాన్ని సుందర నగరంగా తీర్చిదిద్దుకోవడంలో కళ్యాణ మండపాలు, ఫంక్షన్ హాల్స్ నిర్వాహకుల పాత్ర కీలకమని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో నగరపాలక సంస్థ అధికారులు, ట్రాఫిక్ పోలీసు అధికారులు, కళ్యాణ మండపాలు, ఫంక్షన్ హాల్స్, ఫంక్షన్ హాల్స్ ఉన్న హోటల్స్ యజమానులతో వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థకు సహకరించే వారికి ఆస్తి పన్నులో రాయితీ అందించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మౌలిక వసతులు కల్పన, స్వచ్ఛతను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. నిషేధిత ప్లాస్టిక్ వినియోగించకుండా, జీరో వేస్ట్ ఈవెంట్స్ నిర్వహణపై శ్రద్ధ చూపాలని కోరారు. అలాగే వ్యర్థాలను ఆన్ సైట్ కంపోస్ట్ ద్వారా ఎరువు తయారీ చేయాలని, సదరు ఎరువును జీఎంసీ కొనుగోలు చేస్తుందని, దీని ద్వారా వ్యర్థాల నిర్వహణ తేలిక వుతుందన్నారు. సమావేశంలో డెప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, సిటీ ప్లానర్ రాంబాబు, సీఎంఓహెచ్ డాక్టర్ శోభారాణి, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, ట్రాఫిక్ సీఐలు అశోక్ కుమార్, సింగయ్య పాల్గొన్నారు.

ఉత్తమ అధ్యాపకులకు సన్మానం


ఉత్తమ అధ్యాపకులతో వైస్ చాన్సలర్ గంగాధరరావు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి ఆరుగురు అధ్యాపకులు ఉత్తమ అధ్యాపక అవార్డులు పొందడం సంతోషంగా ఉందని విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె.గంగాధర రావు అన్నారు. మంగళవారం అవార్డు గ్రహీతలను ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకేసారి ఆరుగురు అధ్యాపకులు ఎం.త్రిమూర్తి రావు, వై.అశోక్ కుమార్, ఎస్.వి.కృష్ణా రావు, డి.రామచంద్రన్, పి.బ్రహ్మజీరావు, పి.పూర్ణ చంద్రరావులకు అవార్డులు రావడం గర్వించదగ్గ విషయమన్నారు. బోధన, పరిశోధన రంగాల్లో మీరు చేస్తున్న కృషికి ఫలితమని చెప్పారు. ఇటువంటి అవార్డులు బాధ్యతలను పెంచుతాయని తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని అవార్డులతో వర్సిటీ ఖ్యాతిని పెంచాలని కోరారు. విశ్వవిద్యాలయ మరింత అభివృద్ధి చెందేందుకు కృషి చేయాలని కోరారు. సందర్భంలో రెక్టార్ కే రత్న షీలా మణి, రిజిస్ట్రార్ జి. సింహాచలం, ఓఎస్‌డీ ఆర్‌వీఎస్ఎస్ఎన్ రవికుమార్, సీడీసీ డీన్ వి.రవికుమార్, పిజి పరీక్షల కోఆర్డినేటర్ ఎం.సుబ్బారావు, ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ సెల్ డైరెక్టర్ పి.పద్మావతి, కెమిస్ట్రీ విభాగం సీనియర్ ఆచార్యులు ఆర్.రమేష్ రాజు పాల్గొన్నారు.

ఉత్తమ అధ్యాపక అవార్డు గ్రహీతకు అభినందన

ఏఎన్‌యూ: ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, యూనివర్సిటీ మహాత్మ జ్యోతిరావు పూలే చైర్ డైరెక్టర్ ఆచార్య త్రిమూర్తి రావును మంగళవారం ఐపీఎస్ అధికారి షరీన్ బేగం, ఏఎన్‌యూ బీసీ విద్యార్థి సంఘ నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా ఐపీఎస్ షరీన్ బేగం మాట్లాడుతూ వెనుకబడిన తరగతులను ముందుకు నడపడమే జీవిత లక్ష్యంగా ముందుకు సాగుతున్న త్రిమూర్తి రావును ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేయడం గర్వంగా ఉందన్నారు. బీసీ విద్యార్థి సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కోటి యాదవ్ మాట్లాడుతూ పూలే చైర్‌లో పరిశోధన చేసే పరిశోధకులను త్రిమూర్తి రావు ఎంతో ప్రోత్సహిస్తున్నారు. బీసీ విద్యార్థి సంఘ నాగార్జున విశ్వవిద్యాలయ అధ్యక్షుడు రామకృష్ణ, ఉపాధ్యక్షుడు మహేష్, కార్యదర్శి గణేష్, టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు నితీష్, ఉపాధ్యక్షుడు శ్రీను పరిశోధకులు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నడకతో మధుమేహం అదుపు

గుంటూరు మెడికల్: నడక ద్వారా మధుమేహాన్ని అదుపులో పెట్టవచ్చని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ డాక్టర్ యశస్వి రమణ అన్నారు. వరల్డ్ డయాబెటీస్ డే సందర్భంగా ఎస్‌వీఆర్ షుగర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో మంగళవారం డయాబెటీస్‌పై అవగాహన కోసం డయాబెటీస్ వాక్ నిర్వహించారు. డాక్టర్ యశస్వి రమణ ముఖ్య అతిథిగా విచ్చేసి వాక్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ కనీసం అరగంట సేపు వ్యాయామం చేయడం ద్వారా షుగర్ వ్యాధితోపాటు బీపీ కూడా అదుపులో ఉంటుందని పేర్కొన్నారు. ఇతర వ్యాధులు కూడా దరిచేరవని చెప్పారు. వ్యాధి బాధితులు క్రమం తప్పకుండా మందులు వాడుతూ వైద్యుల సలహాలు పాటించడం ద్వారా షుగర్ అదుపులో ఉంటుందని, ఎస్‌వీఆర్ షుగర్ హాస్పిటల్ అధినేత, సీనియర్ మధుమేహ వ్యాధి నిపుణులు వి.వి.రామ్‌కుమార్ అన్నారు. వ్యాయామంతో అనేక వ్యాధులు కట్టడి చేయవచ్చని, దరిచేరవని వెల్లడించారు. దంత వైద్య నిపుణులు డాక్టర్ వి.కమల మాట్లాడుతూ నవంబరు 12 నుంచి డిసెంబరు 12 వరకు ప్రతిరోజూ తమ హాస్పిటల్‌లో ఉచితంగా దంత పరీక్షలు చేస్తున్నామని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

నగరంలో సిటీ బస్సులు తిప్పాలి

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో సిటీ బస్సులు తిప్పాలని గోరంట్లకు చెందిన ఎం.రవీంద్ర సూచించారు. మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం గుంటూరు- 2 డిపోలో డిపో మేనేజర్ ఎస్‌కే అబ్దుల్ సలాం ప్రజల నుంచి ఫోన్ ద్వారా సలహాలు, సూచనలు స్వీకరించారు. గుంటూరు నుంచి హైదరాబాద్, విశాఖపట్నం వెళ్లే సర్వీసులలో ఏసీ స్లీపర్ బస్సులు నడపాలని పాత గుంటూరు చెందిన కిషోర్ కోరగా.. కొత్తగా ఏసీ స్లీపర్ బస్సులు వచ్చిన తరువాత తిప్పుతామని చెప్పారు. నంబూరుకు బస్సులు తిప్పాలని నంబూరుకు చెందిన అంజి కోరగా... ప్రజాదరణ లేనందున బస్సులు తిప్పడం లేదన్నారు.

ఏఎన్ఎంల సమస్యలపై హంస వినతి



డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మికి వినతి పత్రం అందజేస్తున్న హంస అసోసియేషన్ నేతలు

గుంటూరు మెడికల్: ఏఎన్ఎంల సమస్యలపై గుంటూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఆంధ్రప్రదేశ్ హెల్త్ అండ్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్(ఏపీ హంస) జిల్లా అధ్యక్షుడు బి.నాగవర్ధన్ ఆధ్వర్యంలో మంగళవారం సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఏఎన్ఎం గ్రేడ్-3 ఉద్యోగులకు వారి జాబ్ చార్టుకి సంబంధం లేని విధులు కేటాయించి వారి అసలు విధులకు ఆటంకం కలిగేలా చేస్తున్నట్లు వినతిపత్రంలో పేర్కొన్నారు. ఏఎన్ఎంలకు సంబంధం లేని సర్వేకు మినహాయించాలని కోరారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం.టి.కృష్ణబాబు ఇచ్చిన ఉత్తర్వులను డీఎంహెచ్ఓకు చూపించి ఉత్తర్వుల ప్రకారం ఏఎన్ఎంలకు విధులు కేటాయించాలని కోరారు.

అపార్‌ని వేగంగా పూర్తి చేయాలి

నెహ్రూ నగర్: నగరంలోని విద్యా సంస్థల్లో ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ(అపార్) వేగంగా పూర్తి చేయాలని, ప్రధానంగా ఇంటర్మీడియెట్ విద్యా సంస్థలు అపార్ రిజిస్ట్రేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. మంగళవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఆర్ఐఓ, ఎంఈఓలు, గుంటూరు నగరంలోని ప్రైవేట్ ఇంటర్మీడియెట్ విద్యా సంస్థల ప్రతినిధులతో అపార్ రిజిస్ట్రేషన్‌పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఒకటి నుంచి 12వ తరగతి వరకు ప్రతి విద్యార్థి అపార్ నమోదు తప్పనిసరి అన్నారు. ప్రతి విద్యార్థి యుడైస్, ఆధార్ నంబర్ల ద్వారా అపార్ రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుందని చెప్పారు. గుంటూరు నగరంలో 1 నుంచి 5వ తరగతి వరకు విద్యా సంస్థల్లో విద్యార్థుల వివరాలు అపార్‌లో షుమారు 70 శాతం నమోదు చేశారన్నారు. కాని ఇంటర్మీడియెట్ విద్యా సంస్థల్లో కేవలం 29 శాతం మాత్రమే పూర్తి చేశారని వివరించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అపార్ రిజిస్ట్రేషన్ వేగవంతం చేయడానికి ఆయా విద్యా సంస్థలు ప్రత్యేకంగా సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలన్నారు. అపార్ నమోదులో ఏ సమస్య ఎదురైనా ఆయా డిపార్ట్‌మెంట్ అధికారుల దష్టికి తీసుకురావాలని కోరారు. సమావేశంలో డెప్యూటీ కమిషనర్ డి.శ్రీనివాసరావు, ఆర్ఐఓ జుబేర్, ఎంఈఓలు అబ్దుల్ ఖుద్దూస్, రమణయ్య, జ్యోతి కిరణ్, నాగేంద్రమ్మ పాల్గొన్నారు.

డిసెంబర్ 8న పాటలు, ఏక పాత్రాభినయ పోటీలు



లక్ష్మీపురం: సీపీఐ ఆవిర్భవించి డిసెంబర్ 26వ తేదీకి వందేళ్లు కావస్తున్న సందర్భంగా వేడుకలను అభ్యుదయ రచయితల సంఘం, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి, ఏఐటీయూసీ, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో డిసెంబర్ 8వ తేదీన పాటలు, ఏకపాత్రాభినయ పోటీలు ఉంటాయని ఐపీటీఏ జాతీయ కార్యదర్శి గని అన్నారు. కొత్తపేట మల్లయ్య లింగం భవన్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... అభ్యుదయ, దేశభక్తి, జానపద గీతాలతోపాటు సాంఘిక, చరిత్రాత్మక సంబంధిత ఏకపాత్రాభినయ పోటీలు 18 – 35 సంవత్సరాల లోపు యువకులకు ఉంటాయని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆరేటి రామారావు మాట్లాడుతూ యువతను కళారూపాల ద్వారా మేల్కొల్పాల్సిన ఆవశ్యకత ఏర్పడిందన్నారు. ప్రజానాట్య మండలి గుంటూరు నగర అధ్యక్ష, కార్యదర్శులు మిట్టపల్లి మహేంద్ర, చెవుల పున్నయ్య తదితరులు పాల్గొన్నారు. వివరాలకు 94414 52819, 94917 94056 ఫోను నెంబర్లలో సంప్రదించాల్సిందిగా కోరారు.

వీల్‌చైర్లు వితరణ



గుంటూరు మెడికల్: రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ పి.రామచంద్రరాజు మంగళవారం గోరంట్ల ప్రభుత్వ ఛాతి, సాంక్రమిత వ్యాధుల హాస్పిటల్‌కు మూడు వీల్‌చైర్లు అందజేశారు. వ్యాధి బాధితులకు వినియోగించేందుకు వీల్‌చైర్‌లు బహూకరించిన రెడ్‌క్రాస్ నిర్వాహకులకు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీకంటి రఘు కృతజ్ఞతలు తెలిపారు.